ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 267 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 2 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# నగర వాసులకు
# రేవంత్ తీపి కబురు

## మేడ్చల్, శామీర్‌పేటకు మెట్రో పొడిగింపు

### డిపిఆర్ సిద్ధం చేయాలని ఎన్వీఎస్ రెడ్డికి సీఎం ఆదేశం



**హైదరాబాద్, జనవరి 1 (ప్రభాత ఉదయం):** రాష్ట్ర ప్రభుత్వం నగర వాసులకు తీపి కబురు చెప్పింది. మెట్రో రైలు పొడిగింపులో కీలక అడుగు వేసింది. హైదరాబాద్ ఉత్తర భాగం నగరవాసుల మెట్రో రైల్ కల నెరవేరబోతోంది. హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్యారడైజ్- మేడ్చల్ (23 కిలోమీటర్లు), జేబీఎస్–శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్ల డీపీఆర్‌ల తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెంటనే డీపీఆర్‌లను సిద్ధం చేసి మెట్రో రైల్ ఫేజ్–2 'బి'లో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్ల డీపీఆర్ తయారీ విషయంపై చర్చించి ఈ మేరకు సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, ..మిగతా 2లో




ఎయిరిండియా విమానాల్లో
## వైఫై సౌకర్యం
### అందుబాటులోకి తెచ్చిన టాటా గ్రూపు

**న్యూఢిల్లీ, జనవరి 1 (ప్రభాత ఉదయం):** టాటా గ్రూప్‌నకు చెందిన విమానయాన సంస్థ ఎయిరిండియా వైఫై ఇంటర్నెట్ సర్వీసులకు శ్రీకారం చుట్టింది. దేశీయ, విదేశీ విమాన సర్వీసుల్లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 787-9తో పాటు ఎంపిక చేసిన ఏ321 నియో విమానాల్లో ఈ సేవలు లభిస్తాయి. దేశీయంగా ఈ తరహా సేవలందిస్తున్న తొలి విమాన సంస్థ తమదేనని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వంటి అంతర్జాతీయ మార్గాల్లో నడుస్తున్న ఎయిర్‌బస్ ఏ350, ..మిగతా 2లో



ఫార్ములా ఈ కేసు
## లొట్టపీసు కేసు
### ఏదో రకంగా జైలుకు పంపాలని చూస్తున్నారు
### మీడియా సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
### పార్టీ నేతలు, అభిమానుల న్యూ ఇయర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జనవరి 1 (ప్రభాత ఉదయం):** కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ అభిమానులు కెటిఆర్‌ను కలిసి అభినందనలు ..మిగతా 2లో



షరతుల పేరుతో రైతుల నోట్లో
## మట్టికొట్టే యత్నం
### రైతుభరోసాపై హరీష్ రావు విమర్శలు

**సంగారెడ్డి, జనవరి 1 (ప్రభాత ఉదయం):** షరతుల పేరిట రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పత్తి, చెరకు, పసుపు పంటలకు ఒకసారి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటున్నారు. కొండలు, గుట్టలు సాగు చేసే వారికి రైతు భరోసా రాదని ..మిగతా 2లో

# రూ.1350కే
# 50 కేజీల ఎరువుల బస్తా!
### రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్




**న్యూఢిల్లీ, జనవరి 1 (ప్రభాత ఉదయం):** దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.. 50 కేజీల డీఏపీ ఎరువుల బస్తాను 1350 రూపాయలకే అందించనున్నట్లు ప్రకటించింది కేంద్రం. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. 2025, జనవరి ఒకటో తేదీన రైతులకు శుభవార్త అని వివరించారు కేంద్ర మంత్రి. ఇప్పటి వరకు మార్కెట్ లో 50 కేజీల డీఏపీ ఎరువుల బస్తా 1350 రూపాయలే ఉంది.. 2025 జనవరి ఒకటో తేదీ నుంచి డీఏపీ ఎరువుల బస్తాపై 300 రూపాయలు పెంచుతున్నట్లు కంపెనీలు ప్రకటించాయి. అంటే ఇక నుంచి కొనుగోలు చేసే డీఏపీ 50 కేజీల ఎరువుల బస్తా 1650 రూపాయలు కానుంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. డీఏపీ ఎరువుల బస్తాపై ఆయా కంపెనీలు పెంచుతున్న 300 రూపాయల ధరను.. కేంద్రమే సబ్సిడీ రూపంలో ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 2024లో ఉన్న ధర 1350 రూపాయలకే రైతులకు అందించనున్నట్లు స్పష్టం చేసింది కేంద్ర ప్రభుత్వం. రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ. 3,850 కోట్ల వరకు ప్రత్యేక ప్యాకేజీని ఆమోదించింది. ఈ ..మిగతా 2లో



# సీఎం సమక్షంలో భారీగా
# లొంగిపోయిన మావోయిస్టులు

**గడ్చిరోలి జనవరి 1 (ప్రభాత ఉదయం):** మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతమంటేనే మావోయిస్టుల అడ్డ. అలాంటి అడ్డాలో మావోయిస్టులకు బుధవారం చాలా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. దేశంలో మావోయిస్టుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకొంది. ఆ క్రమంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ.. ముందుకు వెళ్తుంది. అలాంటి వేళ మహారాష్ట్రలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం గడ్చిరోలి జిల్లాలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమీక్షంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు. అయితే లొంగిపోయిన వారిలో.. తార్కా సిడం సైతం ఉన్నారు. గడ్చిరోలిలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేదని.. అలాంటి ప్రాంతంలో పోలీసులు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్చిరోలి ప్రాంతాన్ని చత్తీస్‌గఢ్ తో అనుసంధానం చేస్తూ.. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మొబైల్ టవర్లు సైతం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఇక మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు.. ఇటీవల నాగపూర్‌లో ముగిశాయి. ఈ సమావేశాల్లో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఏడాది 33 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణించారని చెప్పారు. ఇక గడ్చిరోలి జిల్లా ఉత్తర భాగం ..మిగతా 2లో

# ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు
### తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం



**చెన్నై, జనవరి 1 (ప్రభాత ఉదయం):** అదానీ కంపెనీతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం బుధవారం వెల్లడించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకునేందుకు అదానీ భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఇటీవల అమెరికా పత్రిక నాన్షియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ (ఎఇఎస్ఎల్)తో స్మార్ట్ మీటర్ల సేకరణ కోసం తమిళనాడు పవర్ డిస్టిబ్యూషన్ కార్పోరేషన్ (టిఎఎన్‌జిఇడిసిఒ) చేసుకున్న ఒప్పందాన్ని స్టాలిన్ ప్రభుత్వం రద్దు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అధిక ధరలను కోట్ చేశారని, అందుకే ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఆగస్టులో నాలుగు ప్యాకేజీలుగా టెండర్లు జరిగాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాలను కవర్ చేసే ..మిగతా 2లో

# నేటి నుంచి టీజీ టెట్-2024 పరీక్ష



**హైదరాబాద్, జనవరి 1 (ప్రభాత ఉదయం):** టీజీ టెట్ 2024 అర్హత పరీక్షలను ఈ నెల 2వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టెట్ పరీక్షలకు 2.75 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. టెట్ హాల్ టికెట్లు 2024. అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు ..మిగతా 2లో



# నగర వాసులకు రేవంత్ తీపి కబురు

మొదటి పేజీ తరువాయి...

బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఆర్ఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, ఆల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్‌కు 22 కిలోమీటర్ల మేర ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని మెట్రో ఎండీ.. సీఎంకు వివరించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్ల రూట్ మ్యాప్‌లపై తనకు మంచి అవగాహన ఉందని సీఎం ప్రస్తావించారు. రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలు తీసుకోవాలని మెట్రో ఎండీని సీఎం ఆదేశించారు. డీపీఆర్ తయారీని 3 నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని సీఎం సూచించినట్టు మెట్రో ఎండీ తెలిపారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం మాదిరిగానే 'బి' భాగాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని సీఎం ఆదేశించినట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని.. ఈ మేరకు వెంటనే డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు.



# రూ.1350కే 50 కేజీల ఎరువుల బస్తా!

మొదటి పేజీ తరువాయి...

ఆర్థిక సహాయం డై-అమ్మోనియం ఫాస్ఫేట్ ఎరువుల ధరను 50 కిలోల బస్తాకు రూ.1,350గా నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకుంది, ఇది రైతులకు గిట్టుబాటు అయ్యేలా ఉంది. బుధవారం (జనవరి 1,2025) నాడు కేంద్ర కేబినెట్ జరిగింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నిధులు 69,515 కోట్లకు పెంచుతూ కేబినెట్ ఆమోదం తెలిపింది. నాలుగు కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంచింది. ఇటీవల పెరిగిన డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని కేంద్రం భరించాలని నిర్ణయించింది. పెంచిన ధర రూ. 300 భారాన్ని తగ్గించి డీఏపీ బస్తా రూ.1350లకే 50 కిలోల అందించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025 నూతన సంవత్సరంలో తొలి కేబినెట్ లో రైతు సంక్షేమానికి ప్రాధాన్యనిస్తూ.. డీఏపీ ఎరువుల సబ్సిడీ రూ.3850 కోట్లు పెంచుతూ ఆమోదం తెలిపింది. ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీకి 800 కోట్ల కేటాయించింది. 2014 -24 వరకు ఎరువుల సబ్సిడీకి 11.9 లక్షల కోట్లు ఖర్చు చేసిన కేంద్రం.

# నేటి నుంచి టీజీ టెట్-2024 పరీక్ష

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ. 12.30 గంటల నుంచి అనుమతించనున్నారు. ఇక పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను క్లోజ్ చేయనున్నారు. అంటే ఉదయం సెషన్‌లో ఉ. 8.45కు, మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు గేట్లను మూసివేయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు(ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ) తీసుకెళ్లాలి. స్మార్ట్ వాచీలతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

# షరతుల పేరుతో రైతుల నోట్లో మట్టికొట్టే యత్నం

మొదటి పేజీ తరువాయి...

చెబుతున్నారు. ఇప్పుడు రైతు భరోసాకు కూడా షరతులు పెడుతున్నారు.రైతు భరోసా కోసం రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటారంట. బడా కంపెనీలు, కార్పొరేట్ వ్యాపారులకు మాత్రం ఎలాంటి షరతులు ఉండవు. రైతులను దోషిగా నిలబెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? రైతులను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దరఖాస్తు లేకుండా భారాస ప్రభుత్వం రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పినట్టు ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాలి. వానాకాలం, యాసంగి పంటలకు కలిపి ఒకేసారి రూ.15వేల చొప్పున ఇవ్వాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఎయిరిండియా విమానాల్లో వైఫై సౌకర్యం

మొదటి పేజీ తరువాయి...

ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బి787-9 ఎయిర్ క్రాఫ్ట్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎయిరిండియా వైఫై సేవలను అందిస్తోంది. దీనికి కొనసాగింపుగా దేశీయంగానూ ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. ల్యాప్‌టాప్, టాబెట్లు, ఐఓఎస్, ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ వంటి డివైజుల్లో ఈ వైఫై సేవలను ఆనందించొచ్చు. విమానం 10 వేల అడుగుల ఎత్తుకు చేరాక ఈ సేవలు లభిస్తాయి. ఒకేసారి పలు డివైజులను వైఫైకి కనెక్ట్ చేయొచ్చు. తొలుత కాంప్లిమెంటరీగా ఈ సేవలు లభిస్తాయని, త్వరలో మరిన్ని విమానాల్లోనూ ఈ సేవలను ప్రారంభించనున్నట్లు ఎయిరిండియా తెలిపింది.

# ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు

మొదటి పేజీ తరువాయి...




తెలిపారు. ఫార్ములా ఈ రేసు కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్ములా ఈరేస్ కేసులో తెలంగాణ హైకోర్టులో ఏ తీర్పు వస్తుందో చూద్దామన్నారు. ఇందులో అవినీతే లేనప్పుడు.. కేసు ఎక్కడది అని ప్రశ్నించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పు అని వ్యాఖ్యలు చేశారు. ఈకేసులో ఈడీ ఎదుట ఈనెల 7న హాజరుపై తన లాయర్లు నిర్ణయిస్తారని తెలిపారు. ఏసీబీ కేసులో అస్సలు పస లేదని..తనకు న్యాయస్థానాల పై నమ్మకం ఉందన్నారు. ఫార్ములా ఈ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. 'పాపం.. నన్ను ఏదో రకంగా జైలుకు పంపాలని ప్రభుత్వం చూస్తోంది. నాపై ఇది ఆరో ప్రయత్నం.. రేవంత్‌కు ఏమీ దొరకటం లేదు' అంటూ సెటైర్ విసిరారు. రూ. 600 కోట్ల సంగతి అటుంచితే.. ఒక్క పైసా కూడా అవినీతి లేదన్నారు.జడ్జి అడిగే ప్రశ్నలకు ఏజీ దగ్గర సమాధానం లేదన్నారు. రేసు కావాలని తాను నిర్ణయం తీసుకున్నాని.. వద్దనేది రేవంత్ నిర్ణయమన్నారు. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదన్నారు. 'నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. రేవంత్ రెడ్డి.. ఒక ముఖ్యమంత్రినా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఎదురయ్యే చిన్న, చిన్న అడ్డంకులను అధిగమించి లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27న భారీ బహిరంగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది మెదటి హాఫ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. తర్వాత గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ అధ్యక్షుడి ఎన్నికకు.. వచ్చే అక్టోబర్ వరకు సమయముందని తెలిపారు. పార్టీ నేతలకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు. రైతుబరోసాతో రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తిరుగుబాటు రాబోతోందన్నారు. రైతుభరోసా కొందరికికే ఇచ్చే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. రైతులకు సెల్ఫ్ డిక్లరేషన్ ఎందుకు అని ప్రశ్నించారు. బ్యాంకులను ముంచేటోళ్ళకే సెల్ఫ్ డిక్లరేషన్ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజిస్ట్రేషన్లు ఇవ్వాలని రేవంత్‌కు లేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వమే కోర్టులో కేసులు వేయిస్తోందన్నారు. ఉద్యోగస్తులు, పాన్ కార్డ్ ఉన్నవాళ్ళకు రైతుభరోసా ఎగ్గొట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఃూగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ మాజీ మంత్రి కేటీఆర్.. హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నిన్న (డిసెంబర్ 31) విచారణ జరిపిన హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు ఈకేసు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి రేపు (జనవరి 2) ఈడీ ముందుకు విచారణకు హాజరుకానున్నారు. అలాగే జనవరి 3 ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరవుతారు. వీరిద్దరి విచారణ మీద ఈనెల 7 కేటీఆర్ ఈడీ విచారణకు హాజరుకావాలా వద్దే అనేదానిపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# సీఎం సమక్షంలో భారీగా లొంగిపోయిన మావోయిస్టులు



మొదటి పేజీ తరువాయి...

పూర్తిగా మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వివరించారు. అలాగే 55 మంది మావోయిస్టులను అరెస్ట్ చేయగా.. 33 మంది లొంగిపోయారని తెలిపారు. మావోయిస్టులపై తమ ప్రభుత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వామపక్ష తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు మూడేళ్ల కాలపరిమి విధించుకున్నామని ఈ సందర్భంగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ గుర్తు చేశారు. మరోవైపు గడ్చిరోలి ప్రాంతానికి చెందిన వందలాది యువత పోలీస్ శాఖలో చేరారన్నారు. వారిలో 33 మంది యువకులు మావోయిస్టులు బాధితులు ఉన్నారని వివరించారు. ఇక మావోయిస్టుల అగ్రనేతలు సైతం లొంగి పోయి జనజీవన స్రవంతిలో కలిశారన్నారు. 2026, మార్చి మాసాంతం నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొంది. అందుకోసం తనదైన శైలిలో ముందుకు వెళ్తుంది. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాల్లో మావోయిస్టుల ప్రభావం భాగా తగ్గిపోయింది. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే.. తెలుగు రాష్ట్రాలు, జారండ్, బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వారి ప్రాబల్యం దాదాపుగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం వారి ప్రాబల్యం కొంత స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ రాష్ట్రంలో సైతం భద్రత దళాలు, స్థానిక పోలీసుల సహయంలో కూబింగ్ తీవ్రతరం చేసింది.అందులోభాగంగా పలు ఎన్‌కౌంటర్లు సైతం చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో దాదాపు 27 మంది అగ్రనేతలు మరణించిన విషయం విధితమే. ఇక దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం .. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు.

# పార్టీ క్యాలెండర్ ఆవిష్కరించిన కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన 2025 క్యాలెండర్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేత కేటీఆర్ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

### చరిత్రలో కేసీఆర్ నిలిచిపోతారు

చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ నిలిచిపోతారని, ఎవరి వల్ల కానిది కేసీఆర్ వల్లే సాధ్యం అయిందని అది అందరికీ తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కేసీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు అని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఆంగ్ల నూతన సంవత్సరం మొదటి రోజున తెలంగాణ భవన్‌కు విచ్చేసి బీఆర్ఎస్ నాయకత్వం మొత్తం ఇక్కడ కొలువుదీరి బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. మనందరం మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నది ఒక్కటే.. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే ఒకే ఒక్క కోరితో గట్టిగా పని చేస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో మన పార్టీ మరిన్ని విజయాలు నమోదు చేయాలని, ప్రజల ఆశీస్సులు పూర్తిస్థాయిలో తిరిగి పొందాలని, మనకు ఎదురయ్యే అడ్డంకులు ఎదుర్కొనే శక్తి ఆ భగవంతుడు మీకు ప్రసాదించాలని, మీ కుటుంబాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ దేశం, రాష్ట్రం ఎల్లవేళలా ప్రశాతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.



# గాయని శివశ్రీని పెళ్లాడనున్న ఎంపీ తేజస్వి సూర్య

**బెంగళూరు, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం):** దేశంలోనే అత్యంత పిన్న వయస్సు ఎంపీలలో ఒకరిగా గుర్తింపు పొందిన తేజస్వి సూర్య ఓ ఇంటివారు కాబోతున్నారు. బెంగళూరు సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున వరుసగా రెండోసారి గెలిచిన తేజస్వి సూర్య.. చెన్నైకి చెందిన ప్రముఖ గాయని, శాస్త్రీయ సంగీతం, భరతనాట్య కళాకారిణి అయిన శివశ్రీ స్కంద ప్రసాద్‌ను పెళ్లి చేసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్యనే బెంగళూరులో నిన్న ప్రకటించారు. మార్చి 24వ తేదీన బెంగళూరులోనే ఆయన వివాహం జరగనుంది. శివశ్రీ శాస్త్ర యూనివర్సిటీ నుంచి బయో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీ నుంచి భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత కాలేజీలో సంస్కృతంలో ఎంఏ పట్టా పుచ్చుకున్నారు. పొన్నియిన్ సెల్వన్ పార్ట్ -2లో కన్నడ వర్షన్‌లో శివశ్రీ ఓ పాట ఆలపించారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు 2 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. తేజస్వి సూర్య వృత్తి రీత్యా లాయర్. కానీ ప్రస్తుతం ఆయన బెంగళూరు సౌత్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 ఎంపీ ఎన్నికల్లోనూ ఆయన గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 3.31 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. తేజస్వి చేతిలో కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఓడిపోయారు. 2020 నుంచి భారతీయ జనతా యువ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

# ఆదానీతో విద్యుత్ ఒప్పందం రద్దు

మొదటి పేజీ తరువాయి...

టెండర్‌లో ప్యాకేజీ 1కి కి అదానీ సంస్థ 82 లక్షలకు పైగా స్మార్ట్ మీటర్లను పంపిణీ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అదానీ సంస్థ కోట్ చేసిన ధర అధికంగా ఉన్నందున డిసెంబర్ 27, 2024న టెండర్‌ను రద్దు చేసినట్లు వెల్లడించాయి. మరో మూడు ప్యాకేజీల టెండర్లను కూడా రద్దు చేశామని తెలిపింది. మరోసారి టెండర్లను ఆహ్వానించే అవకాశం ఉందని పేర్కొన్నాయి.2020-2024 మధ్య లాభదాయకమైన సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం అదానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2029 కోట్ల ముడుపులు ముట్టజెప్పడం లేదా ఇస్తానని వాగ్దానం చేయడం వంటి చేశారని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలియజేసింది. సెకీతో విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకునేలా ఆ వ్యక్తులు పలు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను ఒప్పించారు. ఆ విధంగా కొన్ని రాష్ట్ర విద్యుత్ కంపెనీలు సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2021 జులై, 2022 ఫిబ్రవరి మధ్య కాలంలో ఒరిస్సా, జమ్ము కాశ్మీర్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. ఇందుకు సంబంధించి 54 పేజీల నేరాభియోగ పత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేసినట్లు అమెరికా పత్రిక నాన్సియల్ టైమ్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ అభియోగ పత్రంలోని వివరాలను ప్రముఖ అమెరికన్ పత్రికటైమ్స్ వెల్లడించడంతో ఈ భాగోతం బయటపడింది. నేరాభియోగ పత్రంలో కేటగిరీల వారీగా, వ్యక్తుల వారీగా ఎవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పడం లేదా హామీ ఇవ్వడమో చేశారని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. గౌతమ్ అదానీ మేనల్లుడు సాగర్ అదానీని కూడా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ప్రతివాదుల జాబితాలో చేర్చారు.

## మన్నా చర్చిలో ఘనంగా

# నూతన సంవత్సర వేడుకలు

బుద్వేల్, జనవరి1(ప్రభాత ఉదయం): నూతన సంవత్సరంలో ప్రతి రోజు యేసు క్రీస్తును ఆరాధించే వారిగా ఉన్న వారికి నూతన ఆశీర్వాదాలు, దీవెనలు కలుగుతాయని కింగ్ ఆఫ్ కింగ్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ బ్లెస్సింగ్ రాజ్ కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చిలో చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర ఆరాధనలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాలను అందజేశారు. దేవుని వాక్యానుసారంగా జీవిస్తే వారు ఎక్కడైతే కృంగినవారిగా ఉన్నారో.. అక్కడే లేప బడుతారన్నారు. ప్రతి రోజు యేసయ్యను ఆరాధించే వారిగా ఉండాలన్నారు. 2025వ సంవత్సరం క్రైస్తవులకు దీవెన కరంగా ఉండబోతుం దన్నారు. సిస్టర్ షీబా రాజకుమార్ అనుదినం ప్రార్తన చేయాలన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతిలు నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం రెవరెండ్ బ్లెస్సింగ్ రాజ్ కుమార్‌తో కలసి నూతన సంవత్సర కేక్ కట్ చేశారు.



రాజేంద్రనగర్ మన్నా చర్చ్‌లో జరిగిన నూతన సంవత్సర ఆరాధనలో బైబిల్ సందేశాలను వివరిస్తున్న రెవరెండ్ బ్లెస్సింగ్ రాజ్ కుమార్



శుభాలు చెబుతున్న సిస్టర్ షీభా రాజ్ కుమార్



మాట్లాడుతున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్



నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీ హెచ్ ప్రభావతి లు



బుద్వేల్ బెతెస్తా మిషన్ గాస్పెల్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న రెవరెండ్ కె నతానియేల్



పాటల పాడుతుతున్న సిస్టర్ జయశ్రీ తదితరులు




బైబిల్ సందేశాలను వివరిస్తున్న రెవరెండ్ కె నతానీయేల్

## నూతన సంవత్సరంలో నూతన ఆశీర్వాదాలు: రెవరెండ్ కె నతానియేల్


బుద్వేల్, జనవరి 1(ప్రభాత ఉదయం): నూతన సంవత్సరములో ఏసుక్రీస్తు తనను నమ్ముకున్న వారికి నూతన ఆశీర్వాదాలతో దీవిస్తాడని బెతెస్తా మిషన్ గాస్పల్ చర్చ్ కు చెందిన రెవరెండ్ కె. నతానియేల్ అన్నారు. నూతన సంవత్సర ఆరాధనలో బాగంగా బుధవారం బూద్వేల్, చింతల్ మెట్, కవ్వ గూడ ప్రాంతాలలో గల బెతెస్థా మిషన్ గాస్పెల్ చర్చిలలో బైబిల్ సందేశాలను అందజేశారు. యేసయ్యను శుద్ధ మనసుతో ఆరాధించాలన్నారు. తగ్గింపు స్వభావము కలిగి ఉండాలన్నారు. ఆయన ఆజ్ఞలను అనుసరించి నడుచుకుంటే అమితమైన ఆశీర్వాదాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా సిస్టర్ కె జయశ్రీ తో కలిసి నూతన సంవత్సర కేక్ ను కట్ చేశారు.



ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ని కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కలసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

బుద్వేల్ జనవరి1(ప్రభాతఉదయం): 2025 నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ బుధవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ను ఆయన నివాసంలో యువ నాయకులు పెండ్యాల సాయిమల్లిక్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట బుద్వేల్ కు చెందిన రహ్మత్ ఖాన్, రోహిత్, అరుణ్ యాదవ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న యువ నాయకులు పెండ్యాల సాయి మల్లిక్



డాక్టర్ జి వెంకటేశ్వర్లు

## నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఫెలోగా డాక్టర్ జి.వెంకటేశ్వర్లు

బుద్వేల్, జనవరి1(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) కు జాయింట్ డైరెక్టర్ గా పనిచేసిన డాక్టర్ జి.వెంకటేశ్వర్లు ప్రతిష్టాత్మకమైన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (నాస్) ఫెలో గా ఎంపికైనారు. వ్యవసాయ రంగంలో ముఖ్యంగా మత్స్య రంగంలో అయన విశేష ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ ఫెలోషిప్ దక్కింది. నార్మ్ లో చేరక ముందు అయన భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఎడ్యుకేషన్ డివిజన్ లోని ఎడ్యుకేషన్ క్వాలిటీ అస్యూరెన్స్ రిఫార్మ్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ గా పనిచేశారు. ముంబైలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ లో సీనియర్ సైంటిస్ట్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ గా కూడా ఆయన విదులు నిర్వహించారు. బెంగుళురులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ లో శాస్త్రవేత్తగా పనిచేశారు. డాక్టరు జి.వెంకటేశ్వర్లు ఐసీఏఆర్ అత్యుత్తమ ఉపాధ్యాయులకు ఇచ్చే భారత రత్న సీ.సుబ్రమణ్యం ఆవారుతో పాటు పలు అవార్డులను అందుకున్నారు. తెలంగాణ జిల్లాలోని నక్రికల్ గ్రామంలో జన్మించిన డాక్టర్ జి.వెంకటేశ్వర్లు ప్రతిషాత్మక నాస్ పెలోషిప్ కు ఎంపిక కావడంతో నార్మ్ లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

## 926 కోట్లు తాగేసింద్రు!

హైదరాబాద్, డిసెంబర్ 31 (ప్రభాత ఉదయం): నూతన సంవత్సరారంభం సందర్భంగా రాష్ట్రంలో జరిగిన మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి కిక్కెక్కించాయి. వందల కోట్లల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. డిసెంబర్ నెలాఖరున 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల్లోనే ప్రజలు ఏకంగా రూ.926 కోట్ల విలువైన మద్యం తాగేశారు. ఈ మేరకు డిసెంబర్ నెల మద్యం అమ్మకాల వివరాలను బుధవారం తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు.



సీఎం రేవంత్ రెడ్డిని సన్మానించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు

## సీఎం రేవంత్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు

హైదరాబాద్, జనవరి 1(ప్రభాత ఉదయం) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చంద్ రెడ్డి , మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. ఎం ఆర్ , ఏఐసీసీ కార్యదర్శి ఎస్.ఎ సంపత్ కుమార్ , డిప్యూటీ స్పీకర్ బాలు నాయక్, నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి , ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి,రాజేశ్ రెడ్డి , మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి , నారాయణ పేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి , రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పర్‌పల్లి హొరెబు ప్రార్థన మందిరంలో ఘనంగా నూతన సంవత్సర ఆరాధనలు



పాటలు పాడుతున్న సిస్టర్ పి అనురాధ తదితరులు



నూతన సంవత్సర ఆరాధనలో పాల్గొన్న సంఘ సభ్యులు

బుద్వేల్, జనవరి 1(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి లోని హొరెబు ప్రార్థన మందిరంలో బుధవారం చర్చ్ పాస్టర్ రెవరెండ్ పి స్వర్ణ కుమార్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం విశ్వాసులందరికి దీవెనకరంగా ఉండాలని రెవరెండ్ పి స్వర్ణ కుమార్ ప్రార్థనలు చేశారు. దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన ఆజ్ఞానుసారంగా జీవిస్తే దేవుడు ఊహించలేని గొప్ప కార్యాలు చేస్తాడని తెలిపారు. విశ్వాసులైన వారు అనుదినము ప్రార్థన చేయాలని, ప్రతిరోజూ బైబిల్ వాక్యము చదవాలని సూచించారు. ఈ ఆరాధనలలో సిస్టర్ పి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ పి స్వర్ణ కుమార్



మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ నాయకులు

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

బుద్వేల్, జనవరి1(ప్రభాత ఉదయం): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, జాలిగం చిత్తారి. డి.రమేశ్ ముదిరాజ్ లు శ్రీనగర్ కాలనీలో గల మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇం ద్రారెడ్డి నివాసానికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



## నేడు షాపూర్ విద్యుత్ సెక్షన్‌లో సరఫరాలో అంతరాయం

శంషాబాద్, జనవరి 1(ప్రభాత ఉదయం) షాపూర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని ఓం జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10.00 గంటల నుండి 14.00 వరకు నిర్వహణ కోసం కింది ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. బృందావన్ గార్డెకిషన్ గూడ, రాయల్ విల్లాస్, తొండు పల్లి, బృందావన్ గార్డెన్, సాయి విహార్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## గురుకులాల పర్యవేక్షణ అదనపు కలెక్టర్లకు

హైదరాబాద్, జనవరి 1(ప్రభాత ఉదయం) రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఏడాది కాలంగా వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగు చూస్తుండటం, విద్యార్థులు మరణిస్తుండటంతో ప్రభుత్వం మేల్కొన్నది. ఆయా స్కూళ్లలో వసతులను పర్యవేక్షించే బాధ్యతను అదనపు కలెక్టర్లకు(స్థానిక సంస్థలు) అప్పగించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యాబోధన, వసతులు, నిర్వహణ తీరును పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్లను ఆదేశించింది. భోజన నాణ్యత, తరగతి గదులు, హాస్టళ్లలో వసతులు నిబంధనల మేరకు ఉన్నాయా? లేదా? పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రతి నెల వాటి పనితీరుపై ప్రగతి నివేదిక రూపొందించి కలెక్టర్లకు అందజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా కలెక్టర్లు సమీక్ష నిర్వహిస్తారు. ఆలిండియా సర్వీసెస్ (ఏఐఎస్)కు చెందిన మహిళా అధికారులు (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎ స్ తదితర) తరచూ బాలికల రెసిడెన్షియ ల్ స్కూళ్లను సందర్శించి రాత్రి అక్కడే బస చే యాలని ప్రభుత్వం ఆదేశించింది. అక్కడి పరిస్థితులపై ఏడు రోజుల్లోగా సంబంధిత శాఖకు నివేదిక అందజేయాలని కోరింది.



శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

## ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా కిటకిటలాడిన శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానము

కొత్తకోట, జనవరి 1(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో దేవా లయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శ్రీకోటిలింగేశ్వరస్వామివారిని దర్శించుకొని అలాగే ధ్యానమందిరంలో ప్రతిష్టించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకొన్నారు. ఆలయకమిటి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.




## ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి

గద్వాల ప్రతినిధి, జనవరి 1(ప్రభాత ఉదయం)సివిల్ సప్లై హమాలి కార్మికుల కు ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవార గద్వాలలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్టాక్ పాయింట్ వద్ద సివిల్ సప్లై హమాలి కార్మికుల నిరవధిక సమ్మె ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పౌర సరఫరా సంస్థ లో పని చేస్తున్న సివిల్ సప్లై హమాలి కార్మికుల ఎగుమతి దిగుమతి రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్ తో ముగిసిందన్నారు. నూతన రేట్లకు పెంపు పై కార్మిక సంఘాల సమక్షంలో అధికారులు చర్చలు జరిపి ఎగుమతి దిగుమతి నూతన రేట్లను ప్రస్తుతం ఉన్న రూ.26 నుండి రూ.29 కి అనగా 3 రూపాయలు పెంచారని అన్నారు. ఈ పెరిగిన రేట్ల ను 2024 జనవరి నుండి అమలు చేస్తామని ఏరియర్స్ తో సహా చెల్లిస్తామని, మహిళా స్వీపర్ లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై అదనంగా రూ. 1,000 ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీలు ఇచ్చి 3 నెలలు పూర్తి కావోస్తున్న ప్రభుత్వం, అధికార యంత్రాంగం సివిల్ సప్లై హమాలి కార్మికులకు కనీసం జీఓ కూడా జారీ చేయలేదని విమర్శించారు. ప్రస్తుత పోరాటం నూతన రేట్ల గురించి కాదని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయమని తాము అడుగుతున్నామని అన్నారు ప్రభుత్వం కాలయాపన చేయకుండా,తక్షణమే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు. సమ్మె కు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దతు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ లో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులతో ప్రభుత్వం చర్చించి సమస్యలను పరిష్కరించాలని,ఆ దిశగా వారు చేసే ఉద్యమాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, సివిల్ సప్లై హమాలి కార్మికులు శివకృష్ణ, నరేష్, చిన్న, హనుమన్న, నల్లన్న, టీ.ఆంజనేయులు, నాగన్న, నందకిషోర్,సహదేవుడు, సాయమ్మ, నవీన్, గోవిందు రేషన్ డీలర్ల సంఘం కోశాధికారి అబ్దుల్ ఖాదర్ నాయకులు, రంజిత్, శీను, తదితరులు పాల్గొన్నారు .



స్వామీ వారి సన్నిధిలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

## పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల జిల్లా ప్రతినిధి ,జనవరి 1(ప్రభాత ఉదయం) ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలసిన శ్రీఆంజనేయ స్వామి వారిని బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అర్చకులు కృష్ణాచారి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం ఎంపీ అరుణకు స్వామివారి శేష వస్త్రం బహూకరించారు. ఆమె వెంటా బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి మరొక కొత్త ప్రారంభం: ఎమ్మెల్యే జిఎంఆర్



దేవరకథ ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, జనవరి 1(ప్రభాత ఉదయం) అందరికీ మంచి జరగాలని కోరుకుందాం, మన కుటుంబం మన శ్రేయోభి లాషులు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలన్నారు. సంవత్సరాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి కానీ ప్రతి కొత్త సంవత్సరం ఎన్నో ఆశలను మరెన్నో ఆశయాలను మోసుకొస్తుంది. మనం ఇప్పటివరకు చేయలేనివి ఈ కొత్త ఏడాదిలో అయినా పూర్తి చేయాలని గుర్తుచేస్తుంది. కాలం ఆగదు గడిచిన క్షణం వెనక్కి రాదు. కాలం ఎలా అయితే ముందుకు వెళ్తుందో. అలాగే మనమంతా కూడా ముందుకు వెళ్లాలి. పురోగమించాలి. అనుకున్న పనులు నెరవేరాలి అన్ని శుభాలు జరగాలని ఆశిద్దాం, భవిష్యత్తు బాగుండాలని కలలు కందాం, ఆ కలలు నెరవేర్చుకునే దిశగా అడుగులు వేద్దాం. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆశిస్తూ, భగవంతుడు ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, విజయం, ఆరోగ్యం ప్రసాదించాలని కోరుకున్నారు.

# ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

## భక్తిపాటలు, భజనలతో పరవశించిన అయ్యప్పస్వాములు




అయ్యప్ప స్వాములు సహస్ర కలిశాభిషేకం



పాదయాత్రతో అయ్యప్ప స్వాములు



పూజల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

గద్వాల ప్రతినిధి, జనవరి 1(ప్రభాత ఉదయం)అయ్యప్ప స్వామి దీక్షలతో గద్వాల పట్టణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. దీనిలో భాగంగా అయ్యప్ప స్వామి భక్తులు స్వామి ఉత్సవమూర్తిని, సప్త నదుల నుండి కూడిన 1008 సహస్ర కలశాలతో పట్టణంలో బుధవారం ఊరేగించారు. అనంతరం గద్వాల పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని అయ్యప్ప దేవాలయం వద్ద అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రభాతసేవ, గణపతిహెూ మం, అయ్యప్పస్వాములు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వాములు 1008 సహస్ర కలశాలతో గద్వాల పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. యాత్ర పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా అయ్యప్ప స్వామి ఆలయం వరకు చేరుకుంది. పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న ప్రాంతంలో ప్రముఖులు , పట్టణ ప్రజలు పాల్గొని పూజలు నిర్వహిం చారు. అయ్యప్ప కరుణతో పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఊరేగింపులో అయ్యప్పస్వాములు భక్తిపాటలు, భజనలు, కీర్తనలు పాడి పరవశం చెందారు. పెద్ద ఎత్తున బా ణసంచా కాల్చారు. శోభాయాత్రలో వందలాదిగా అయ్యప్పస్వాములు, వేలాది మందిగా భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్ర నిర్వహిస్తున్న దారిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు వాహనాలకు దారిమళ్లిం చారు. అయ్యప్ప ఆలయం వద్దకు చేరాక అయ్యప్ప స్వాములు స్వామికి సప్త నదుల నుండి తీసుకవచ్చిన నదీ జలాలతో కలిశాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజుని సన్మానిస్తున్న సినీ ఆర్టిస్టులు ఎఫ్‌డిసి చైర్మన్

## దిల్ రాజుని కలిసిన తెలంగాణ మూవీ టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కమిటీ

హైదరాబాద్, జనవరి 1(ప్రభాత ఉదయం) నూతన ఆంగ్ల సంవత్సర శుభ సందర్భంగా.. ప్రముఖ ప్రొడ్యూసర్ ,ఎఫ్ డి సి చైర్మన్ దిల్ రాజు ను తెలంగాణ మూవీ టీవీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కమిటీ, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలు వాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. యూనియన్ కు సంబంధించిన పలు అంశాలపై ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. అందుకు ఎఫ్ డి సి చైర్మన్ దిల్ రాజ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏ రాజశేఖర్ (ప్రెసిడెంట్) నందూరి రాము (ఆల్ కమిటీ చైర్మన్) బి నూకరాజు (జనరల్ సెక్రెటరీ) కెపి రెడ్డి(ఆర్గనైజింగ్ సెక్రటరీ) కె రామ్మోహన్ (జాయింట్ సెక్రెటరీ) ఈసీ మెంబర్స్ ఆకెళ్ళ గోపాలకృష్ణ, వర్షిత, కందుల శివ క్యాస్టింగ్ కమిటీ సభ్యులు, పరమేష్ తాందారి, ఇతర కమిటీ సభ్యులు సాధారణ సభ్యులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకునేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదలం: ఎంపీ డీకే అరుణ



దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల ప్రతినిధి: జనవరి 1(ప్రభాత ఉదయం) విద్యాశాఖలో పని చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల(ఎస్ఎస్ఏ)కు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు కాంగ్రెస్ పార్టీనీ వదిలే ప్రసక్తి లేదని, అప్పటి వరకు ప్రశ్నిస్తునే ఉంటామని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గద్వాల పట్టణం స్మృతి వనం వద్ద ఎస్ఎస్ఏ ఉ ద్యోగులు చేపట్టిన దీక్షా శిభిరానికి బుధవారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ చేరుకుని వారికి సంఘీభావం తెలియజేశారు. వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో జనవరి ఒకటిన కూడా ఇలా దర్నాలు జరగడం సిగ్గుచేటు అన్నారు. చాలీచాలని వేతనాలతో దశా బ్ద కాలంగా ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకంతో పాటు ఇతర పనుల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు, తాము అధికారంలోకి వస్తే ఎస్ఎస్ఏ ఉద్యో గుల సమస్యలు పరిష్కరిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి హామీలను నెరవేర్చకపోవడం సిగ్గుచేటు అన్నారు. గతంలో చాయ్ తాగినంత సేపట్లో పరిష్కరిస్తామన్నోళ్లు ఇప్పుడేం చేస్తున్నట్లు అని సీఎం రేవంత్ రెడ్డి పై ఆమె మండిపడ్డారు. సీఎం రేవంత్ చాయ్ ఒడుస్తలేదా అని సెటైర్లు విసిరారు. ఎస్ఎస్ఏ ఉ ద్యోగులు 23 రోజులుగా సమ్మె చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన సర్వశిక్షా అభియాన్ ఉద్యోగ సంఘాలతో చర్చలకు పిలిచి, సాధ్యమైనంత త్వరలో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, బండల పద్మావతి, ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘాల నాయకులు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాజీ మంత్రి కేటీఆర్ ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## మాజీ మంత్రి కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, జనవరి 1(ప్రభాత ఉదయం) నూతన సంవత్సర సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామరావు ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సాయిజెన్ శేఖర్ లు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు.



గద్వాల సిఐ శ్రీనుకు ఆలయ చరిత్ర పుస్తకం అందజేస్తున్న ఆలయ చైర్మన్ ప్రహల్లాద రావు

## మల్దకల్ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న గద్వాల్ సిఐ శ్రీను

గద్వాల ప్రతినిధి, జనవరి 1(ప్రభాత ఉదయం) మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం గద్వాల సీఐ టంగుటూరి శ్రీను దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐకి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం సత్కరించి, ఆలయ చరిత్ర పుస్తకాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, బాదామీ శ్రీనివాసులు, వీరారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608